


# అర్హత

**శ్రీమతి పూళ్ల సీతాదేవి**

"రాధా! ఈ నెల జీతంలో వందరూపాయలు తరిగిందే?" చేతిలో వున్న నోట్లను లెక్కపెట్టుకుంటూ అడిగాడు శంకరం.

రాధ క్షణకాలం భర్తవేపు చూసి తలొంచుకుంది. ఇటువంటి ప్రశ్న వస్తుందని ముందే వూహించింది! భర్త ఈ ప్రశ్న వేస్తే ఏటువంటి జవాబు చెప్పాలో కూడా ఆలోచించి వుంచుకుంది! కానీ తీరా శంకరం అడిగేసరికి ఏదో జంకు కలుగుతోంది. నోట్లోంచి ఒక్క మాట కూడా రాలేదు.

"నిన్నే అడిగేది? ఏమయింది మిగతా డబ్బు?" శంకరం తీవ్రంగా అడిగాడు.

"అది... అది...!"

"ఊ... అది?"

"తమ్ముడికి పంపాను!" అంది నీలాగో గొంతు పెగల్చుకుని! ఆ జవాబు వినగానే శంకరం రెచ్చిపోయాడు.

"ఏమిటి? నీ తమ్ముడికి పంపావా? నన్నడిగి పంపావ్! అంతా నీ ఇష్టమేనా? ఈ మధ్య నీకు మరీ పొగరెక్కిందిలే!" కోపంగా అరిచాడు.

రాధ కళ్లల్లో నీళ్లు తిరిగాయి.

"నేనీ నెల ఒక నూటు కుట్టించుకోవాలనుకున్నాను. నువ్వు నాకు చెప్పకుండా వంద రూపాయలు నీ తమ్ముడికి పంపావుగదూ! ఇక నా జీతంలో ఇంట్లోకి పైసా కూడా ఇవ్వను. ఎలా గడుపుతావో గడుపు!" అంటూ రాధ ఇచ్చిన జీతాన్నంతా జేబులో పెట్టుకున్నాడు!

రాధ ప్రాణం విలవిలలాడి పోయింది.

"ఎలాగండీ?" అంది దీనంగా.

"ఏమో నాకేం తెలుసు? మీ తమ్ముడ్ని అడుగు!" అంటూ చెప్పులు వేసుకున్నాడు.

"ఇదిగో: ఇదే లాస్ట్ వార్నింగ్. ఇకనుండీ జీతం అంతా నా చేతిలో పెట్టాలి. లేకపోతే నీకీ ఇంట్లో స్థానం వుండదు. గుర్తు పెట్టుకో!" అనేసి బయటికెళ్ళి పోయాడు.

రాధ స్థాణువులా నిలబడిపోయింది.

* * *

రాత్రి పదకొండు గంటలయింది.

సాయంత్రం ఆరు గంటలకి బయట కెళ్ళిన శంకరం ఇంకా ఇంటికిరాలేదు.

రాధ కిటికీ దగ్గర నిలబడి బయటికి చూస్తోంది. చెంపలమీద నుండి జారుతోన్న కన్నీరు వెన్నెల వెలుగులో ముత్యాల సరంలా మెరుస్తోంది.

శంకరం అన్న మాటలే ఆమె మనస్సులో మెదులుతున్నాయి.

"ఇకనుండీ జీతం అంతా నా చేతిలో పెట్టాలి. లేకపోతే నీకీ ఇంట్లో స్థానంలేదు"

శంకరం నోటినుండి ఇటువంటి మాటలు వినడం తన కలవాటే. కానీ ఇవ్వాళ మనస్సెందుకో విపరీతంగా బాధ పడుతోంది.

తన పెళ్ళయి రెండేళ్ళవుతోంది. ఈ రెండేళ్ళల్లోనూ శంకరం కేవలం ఒక అధికారిగానే ప్రవర్తించేడు. కానీ భర్తగా ఒక్క క్షణం కూడా ప్రేమ, ఆప్యాయతల్ని చూపలేదు. తన కిష్టం లేకపోయినా వుద్యోగం చేయిస్తున్నాడు.

సాయంత్రం అయిదవగానే ఇంటిదగ్గ రుండాలి. ప్రతినెలా జీతమంతా అతని చేతిలో పెట్టాలి. తనవేపు వాళ్ళెవరూ గడప తొక్క కూడదు. వాళ్ళకి తను పైసా కూడా ఇవ్వ కూడదు. ఇక ఇంట్లో ఏ కూర వండాలో దగ్గర్నుంచి అన్నీ అతనిష్టంమీదే జరగాలి.

ఇవి శంకరం తనకు విధించిన నియమాలు ఇందుకేమాత్రం విరుద్ధంగా జరిగినా ఇక ఆ రోజు ఇల్లు నరకంగా మారిపోతుంది. అందుకేఅతనిష్ట ప్రకారమేనడుచుకుంటోంది.

వారం రోజుల క్రితం తమ్ముడు ఉత్తరం వ్రాశాడు—

"అక్కా! అయిదో తారీఖు లోపల పరీక్ష ఫీజు కట్టాలి! నాన్న ఎంతో ప్రయత్నించారు. కానీ ఎక్కడా అప్పు దొరకలేదు. పరీక్ష ఫీజు కట్టకపోతే ఈ సంవత్సరం వృధా అయి పోతుంది నిన్ను అడుగుతానంటే నాన్న వద్దన్నారు. అందుకే నాన్నకు తెలీకుండా రాస్తున్నాను. అక్కా! ఈ ఒక్కసారికి ఒక్క వంద రూపాయలు పంపించు. ఇంకెప్పుడూ అడగను. అక్కా! నీ డబ్బు నేనే ఎలాగోలా నీకు పంపిస్తాను. అక్కా! ఈ ఒక్క వుపకారం చెయ్యి. నీ తమ్ముడి జీవితాన్ని దానితోపాటు ఈ కుటుంబాన్ని రక్షించు."

ఆ వుత్తరం చదవగానే తన మనస్సు నీరయిపోయింది. నాన్న, అమ్మ, తమ్ముళ్ళు, చెల్లెళ్లు కళ్ళముందు మెదిలారు.

నాన్న ఎంతో కష్టపడి తనని చదివిం చారు. అతి కష్టంమ్మీద వుద్యోగం వచ్చింది తనకి. వుద్యోగంలో చేరిన ఆరు నెలలకి పెళ్ళ యింది. వెంటనే శంకరం తననిక్కడికి ట్రాన్స్‌ఫర్ చేయించాడు. ఇక ఆ తరువాత తన వాళ్ళకి తను ఏ విధంగానూ సహాయం చేయలేకపోయింది. తన చదువుకి, పెళ్లికి అయిన అప్పు పాపంలా పెరుగుతోంది! దానికి తోడు తమ్ముళ్ళు, చెల్లెళ్ళు చిన్నవాళ్లు. అందరూ చదువుకుంటున్నారు. నాన్న ఎలా గడుపుతున్నారో! ఏమో!

తమ్ముడి ఉత్తరం చూసి ఇక ఆగలేక పోయింది. వెంటనే డబ్బు మనియార్డరు చేసింది. దానికి ఇంత గొడవ జరిగింది. ప్రస్తుతం తన చేతిలో పైసా లేదు నెలంతా గడవాలి! ఎలా!

ఇక ప్రతి రోజూ ఈ ఇంట్లో నరకాన్నే సృష్టిస్తాడు శంకరం.

పెళ్లి కాక ముందు సంసారాన్ని గూర్చి, భర్త గూర్చి ఎన్నో కలలు కంది. కాని జీవితం ఇంత హీనంగా వుంటుందని కలలో కూడా అనుకోలేదు.

ఇన్నాళ్ళూ ఎలాగో భరించింది.

ఇక తన వల్లకాదు.

రేపట్నుంచీ అతడు పెట్టే బాధలకు తను తట్టుకోలేదు.

అయినా తనకేం తక్కువ?

వుద్యోగం వుంది.

ఆర్థికంగా స్వతంత్రురాలు. తను మెత్తగా వూరుకుంటుంటే మరీ దౌర్జన్యం చూపు తున్నాడు.

అతడు తనకి కొన్ని రూల్సు పెట్టాడు గదా! తనూ అతనికి కొన్ని నియమాలు పెడుతుంది. దానికతడు ఒప్పుకుంటేసరి! లేక పోతే ఈ ఇంట్లోంచి వెళ్ళిపోతుంది. వెళ్ళి పోయి హాయిగా జీవిస్తుంది. అంతేకానీ తన కీ బానిసపు బ్రతుకు వద్దు! బాధలు వద్దు.

అలా అనుకోగానే రాధకి ఎంతో ధైర్యం వచ్చింది.

అవును. స్త్రీ అంటే అబలకాదు. సబల. ఆమె ఎంతటి ప్రేమను చూపగలదో, అంతటి ప్రళయాన్ని సృష్టించగలదు.


ఆనాటి చరిత్రలు-ఈనాటి మేటినవలలు



శ్రీ ప్రసాద్ రచనలు
(విజయ సీరియల్స్)

| | |
|---|---|
| విజయనగర పతనం-1 | 13.00 |
| విజయ నగర పతనం-2 | 12.00 |
| షాజహాన్ | 13.00 |
| సామ్రాట్ శ్రీరంగరాయ | 10.00 |
| లకుమాదేవి(లల్లాదేవి రచన ఆంధ్రభూమి సీరియల్) | 15.00 |
| ఆర్య చాణక్య | 13.50 |
| అప్పాజీ | 12.00 |
| యుగంధర్ | 13.50 |
| రోషనార | 10.00 |



* అన్ని బుక్ షాపుల్లోనూ దొరుకుతాయి. దొరక్కపోతే కోరిన పుస్తకాల విలువలో ఒక రూపాయి తగ్గించి M.O. పంపితే మిగిలిన మొత్తానికి V.P.లు పంపుతాము!

నవజ్యోతి పబ్లికేషన్స్
నవజ్యోతి పబ్లికేషన్స్ ఏలూరురోడ్ విజయవాడ-520002

# అర్హత

ఈ పురుష దౌర్జన్యాల్ని స్త్రీ ఇక సహించబోదు. ఎదిరించి నిలబడుతుంది.

అంతేకాదు. తనలా పురుషాహంకారానికి బలౌతున్న స్త్రీలకు ఆత్మస్థైర్యాన్ని కలిగిస్తుంది. మార్గదర్శకురాలౌతుంది— అనుకుంది రాధ తృప్తిగా.

* * *

కథ పూర్తిచేసి— ఒక్కసారి చదువుకుని సంతృప్తిగా తలూపింది నీరజ.

తను రచయిత్రిగా పేరు తెచ్చుకుంటున్న దగ్గర్నించీ తన కనేకమంది అభిమానులు ఏర్పడ్డారు.

వాళ్ళు తనకు రాసే వుత్తరాలు చాలా తమాషాగా వుండేవి.

వాళ్లల్లో కొందరు—

"నీరజగారూ! మీరు కూడా ఎక్కువ ప్రేమ కథలే రాస్తారే! ఆడవాళ్ళ సమస్యలు ఎన్నో వున్నాయి గదా! వాటిని కథా వస్తువులుగా తీసుకుని వ్రాయండి." అనేవారు.

వాళ్ళ మాటలు తనకూ నచ్చాయి.

ఇన్నాళ్లకి మొదటి ప్రయత్నంగా ఈ కథ రాసింది.

ఈ కథని పాఠకులు మెచ్చుకుంటే ఇటువంటి స్త్రీలని గూర్చే కథలు రాస్తాను—

అనుకుంటూ కాగితాలు బొత్తిగా పెట్టి దానిమీద పేపర్ వెయిట్ పెట్టింది.

లేచి వంటింట్లోకి వెళ్ళి వంట పూర్తిచేసింది. స్నానం చేసి ఇస్త్రీ చీర కట్టుకుంది.

ఇంతలో పిల్లలు ఆటల నుండి వచ్చారు. వాళ్ళకు అన్నాలు పెట్టింది. వాళ్ళు కాసేపు చదువుకుని పడుకొన్నారు.

నీరజ భర్తకోసం ఎదురు చూస్తూ వారపత్రిక తిరగేస్తూ కూర్చుంది.

పది దాటుతుండగా ప్రకాశం వచ్చాడు. తలుపు తీసిన నీరజకి గుప్పున సారా వాసన కొట్టింది.

"మళ్లా తాగొచ్చారన్నమాట!" అనుకుంటూ చిన్నగా నిట్టూర్చింది.

ప్రకాశం సరాసరి వచ్చి బెడ్‌రూమ్‌లో వున్న బెడ్ మీద కూర్చున్నాడు. నీరజ అతని వెనకే వచ్చింది.

"భోజనం చేస్తారా?" అనడిగింది.

"వద్దు! మంచినీళ్ళు తెచ్చిపెట్టు!" అన్నాడు.

నీరజ తెచ్చి ఇచ్చింది. ఒక గుక్క తాగి—

"ఏమిటింత చేదుగా వున్నాయి?" అని గ్లాసు విసిరికొట్టాడు.

నీరజ భర్తవేపు నిర్లిప్తంగా చూస్తూ వుండిపోయింది

ప్రకాశం బెడ్‌మీద వాలి—

"ఏయ్! ఇలారా?" అన్నాడు.

నీరజ దగ్గరగా వెళ్ళింది.

"నిన్న పత్రిక నుండి డబ్బు వచ్చిందన్నావు గదా! ఏదీ!" అనడిగాడు.

"దేనికి?"

"అదేం ప్రశ్న! నాకు కావాలి! ఇవ్వు!" అన్నాడు.

కానీ దానితో నీరజ కూతురికి చెవి రింగులు చేయించాలనుకుంది.

ప్రకాశం జీతం మూడొంతులు అతని తాగుడికి, పేకాటకి ఖర్చయిపోతుంది. ఆ మిగతా డబ్బుతోనూ, తన కథలమీద వచ్చే డబ్బుతోనూ అతి కష్టంమీద ఇల్లు గడుస్తోంది.


ఎన్నాళ్లనుండో కూతురికి రింగులు చేయించాలని అనుకుంటోంది. నిన్న సీరియల్ కథకి డబ్బు రాగానే ఆ డబ్బుతో చేయించాలని నిర్ణయించుకుంది!

## పళ్ల జబ్బుల్ని కనిపెట్టే పరికరం!

దంత వ్యాధులను తొలి దశలోనే గుర్తించేందుకు పశ్చిమ జర్మనీలోని సీమెన్స్ సంస్థ ఒక క్రొత్త విధానాన్ని రూపొందించింది. దీని కోసం పెరియ్యాట్రిన్ యూనిట్ అనే క్రొత్త పరికరాన్ని తయారు చేశారు. మొదట ఒక ఫిల్టర్ కాగితాన్ని దంతాల మధ్య వుంచుతారు. చిగుళ్లలో వ్యాధి వలన ఏర్పడే ద్రవాన్ని యీ ఫిల్టర్ కాగితం పీల్చుకుంటుంది. దీనిని పెరియ్యాట్రిన్ యూనిట్ నందు వుంచితే 20 సెకన్లలో వ్యాధి వివరాలు అందగలవు. ఈ విధంగా దంత వ్యాధులను తొలి దశలోనే, దంతాల రంగు మారటం లేక రక్త స్రావం ఏర్పడక ముందే కనుగొనవచ్చు.

మీ గృహాలంకరణకు
కావలసిన
ఫర్నిషింగ్స్, డోర్ కర్టెన్స్,
బెడ్ షీట్స్, టవల్స్,
కార్పెట్ కవర్స్, సోఫా కవర్స్‌కు
దర్శించండి
ఫోన్: 73708
డెకార్స్
V.H.R కాంప్లెక్స్, బీసెంట్ రోడ్
విజయవాడ-2.
PAPUB

పెండ్లి ముందు, తర్వాత
భారత ప్రఖ్యాత సెక్స్ స్పెషలిస్ట్
Dr. RAI
(GOVT. REGD.)
ఆదివారం సెలవు లేదు.
రాయ్ మెడికల్ హాల్
ESTD (1950)
విజయవాడ-3. Ph: 74658



విజయ అండ్ కో
మెయిన్ రోడ్, గుంటూరు
పద్మ అండ్ కో
మెయిన్ రోడ్, గుంటూరు
విజయ అండ్ కో
ఏలూరు రోడ్, విజయవాడ
TARA-VIJ-10182



# డాక్టర్ సలహాలు

డాక్టర్ కె. వెంకటేశ్వరరావు

**డి బి ఆర్. – పెనుమూరు**

నాకు ఏదైనా చదివితే తల నెప్పి వస్తుంది. తల విదిలించితే కూడా వస్తుంది. ఎందువలన ఈ తలనెప్పి వస్తుంది? దీనికి నివారణ ఏమిటి ? విద్యార్థిగా నాకు చాలా బాధగా వున్నది.

దృష్టిలోపం ఉన్నవారికి తలనెప్పి తరచు రావచ్చును. తల విదిలించే సమయంలో చెవులలో ఉన్న ఎండోలింప్, పెరిలింప్‌ల కదలికల మూలంగా మెదడుకి వెళ్లే నరాలు ప్రేరేపింపబడి తలనెప్పి రావచ్చును.

మీరు కళ్లు, చెవులు పరీక్ష చేయించుకొని చికిత్స పొందటం మంచిది.

**కె ఎల్. – కుప్పం**

నా వయస్సు 23 సంవత్సరములు. నాకు ఒక ఏడాది క్రితం, పంటినొప్పివచ్చి చిగురు వచింది. 4 పెన్సిలిన్ ఇంజక్షనులు వాడాక తగ్గింది. కాని చిగురు దగ్గర వాపు మాత్రం అలాగే వున్నది. ఇప్పుడు అక్కడనొక్కితే కొంచెం నొప్పిగా ఉంటుంది. ఒక నెల రోజుల ముందు ఆ చిగురు దగ్గరే చీము రావటం ప్రారంభించింది. మళ్లీ ఇంజక్షన్‌లు రెడాక్సాన్ మాత్రలు వాడాక తగ్గినది. మళ్లీ అక్కడే చీము వస్తోంది. ఇలా ఎందుకు వస్తోంది? దీనికి ఏమి మందులు వాడాలి ?

దీనినే పయోరియా అల్వియొలారిస్ అని అంటారు. చిగుళ్ల క్రింద ఉండే ఎముకకి చీము పట్టడమే ఈ రోగము కారణం.

ఆ భాగం ఎక్స్‌రే తీసిచూసి, యాంటీబయాటిక్ మాత్రలు— టెట్రాసైక్లిన్, యాంపిసిల్లిన్ వంటివి వైద్యుల సలహామేరకు వాడవలసి ఉంటుంది. రెడాక్సాన్ మాత్రమే వాడటంవల్ల లాభం ఉండదు.

**ఆర్. పి. యస్. – మద్రాసు**

నా వయస్సు 17 సంవత్సరములు. నేను పది సంవత్సరముల వయస్సు నుండి సన్నగా ఉన్నానట. ఆహారంలో లోపం లేదు. ప్రతిదినము పాలు త్రాగుతాను. అయినా లావు కావటం లేదు.

లావు, సన్నం అనే కొందరి శరీర తత్వాన్ని బట్టి, వంశపారంపర్యంగా వచ్చే కొన్ని లక్షణాలని బట్టి తీర్మానించబడతాయి. కొందరికి ఏ కారణం లేకుండానే సన్నగా ఉండటం జరుగుతుంది.

పాలు త్రాగటం వల్ల మాత్రమే లావవుతా ననుకోవటం పొరపాటు.

**కె. బి. ఎస్. – విజయనగరం**

నాకు చాలా రోజుల నుంచి తొడల సందులో మచ్చలు ఏర్పడినాయి. గోకితే పొట్టులా వస్తోంది.

ఫంగస్ ఇన్‌ఫెక్షన్ ఉండటంవల్ల ఇలా రావటం జరుగుతుంది. పై పూతగా కెనలాగ్— ఎస్ వంటి ఆయింట్‌మెంటు వాడి, లోనికి గ్రైసోవిన్ వంటి యాంటీఫంగల్ మాత్రలు వాడవలసి ఉంటుంది.

**పి. హెచ్. కె. జె. – రేపల్లె**

నాకు ఈ మధ్యనే వివాహం అయినది. మేము నిరోధ్ వాడదలచుకుంటున్నాము. నిరోధ్ వాడటం వల్ల గర్భం రాకుండ వుంటుందా? బహిష్టు క్రమంగా వస్తుందా? ఏమైనా హాని వుంటుందా?

నిరోధ్ వాడకంవల్ల గర్భంవచ్చే అవకాశంలేదు. బహిష్టు రావటానికి నిరోధ్ వాడటానికీ ఏ సంబంధముగాలేదు. ఏ విధమైన హానీ నిరోధ్ వాడటంవల్ల ఉండదు.

**జి. ఆర్. ఆర్. – కరీంనగర్**

సిగరెట్లు త్రాగటం హిప్నాటిజం ద్వారా మానవచ్చునని విన్నాను. అది సాధ్యమేనా?

సిగరెట్లు త్రాగటం స్వతహాగా మానాలి గాని ఏ విధమైన మందులవల్లగాని వేరే ఇతరవిధాలుగా "చికిత్స" చేయుటం వల్లగాని మానటంఅసాధ్యం, మానాలి అనే మానసిక దృఢత్వం ఉండాలి.

**టి. ఆర్. ఎన్. – తిరుపతి**

హెమాంజియోమా అంటే ఏమిటి? ఎలా వస్తుంది? ఎందుకు వస్తుంది? అది పోతుందా?

హెమాన్‌జియోమా అంటే చిన్న చిన్న రక్తనాళాలు ఎక్కువగా పెరిగిపోయి ఒకదానిలో ఒకటి కలిసిపోయి ఎర్రని మచ్చలాగా నో బుడిపెలాగా నో అవటమే !

పుట్టుకతోనే ఈ అవలక్షణం ఏర్పడుతుంది. ఆల్కహాల్ ఇంజక్షన్లవల్ల లేక శస్త్రచికిత్స ద్వారా తీసివేయుటం వల్ల ఈ హెమాన్‌జియోమాలు పోయే అవకాశం ఉన్నది.

---

"ఏం మాట్లాడవే ?" ప్రకాశం రెట్టించాడు. "వాటితో పాపకి రింగులు చేయిస్తావండీ !" అంది నీరజ మెల్లగా.

ప్రకాశం చటుక్కునలేచి కూర్చున్నాడు — "దానికి ఇప్పుడు రింగులేం అక్కర్లేదులే ! నాకు కొన్ని అప్పులున్నాయి తీర్చాలి. ఇవ్వు !"

ప్రకాశానికి ఇంటి సంగతి అక్కర్లేదు ! భార్యా పిల్లలు అవసరాలు అతనికి పట్టవు ! డబ్బంతా పేకాటలో చేసిన అప్పులు తీర్చుకోడానికే సరిపోతుంది

"ఏం ఇంకా దెయ్యంలా నిలబడ్డావే ! వెళ్లి డబ్బు తెచ్చిపెట్టు ! ఫో " అరిచాడు.

అతడు అడిగినప్పుడు డబ్బు ఇవ్వకపోతే ఇల్లెంత నరకంగా మారుతుందో తనకు తెలుసు.

మాట్లాడకుండా వెళ్లి డబ్బుతెచ్చి అతని కిచ్చింది.

ప్రకాశం దాన్ని జేబులో పెట్టుకుని — "వెరీగుడ్ ! నువ్వు చాలా మంచిదానివి నీరజా !" అన్నాడు.

హుషారుగా ఈల వేసుకుంటూ బట్టలు మార్చుకుని పడుకున్నాడు.

నీరజకి నిద్ర రాలేదు.

మంచం మీద కూర్చుని శూన్యంలోకి చూడసాగింది.

ఇంతలో—

కిటికీలో నుండి వీచిన గాలికి టేబిల్ మీద వున్న కాగితాలు రెప రెప లాడాయి. ఆ చప్పుడికి నీరజ తల తిప్పి టేబిల్ వేపు చూసింది. తన కథ తాలూకు కాగితాలు కన్పించాయి.

లేచి టేబిల్ దగ్గరకెళ్లి ఆ కాగితాల్ని తన చేతిలోకి తీసుకుంది

"నా కిటువంటి కథలు రాసే 'అర్హత' లేదు" అనుకుని ఆ కాగితాలు చింపి ముక్కలు చేసింది.

రివ్వున వీచిన గాలికి ఆ కాగితాలు కిటికీలో నుండి బయటికి ఎగిరిపోయాయి !